నాలుగో యూనిట్

# 16. శతకపద్యాలు


కింది చిత్రం చూడండి.




© SCERT not to be republished


**ప్రశ్నలకు జవాబులు చెప్పండి.**

- చిత్రంలోని పాప ఏం చదువుతున్నది?
- ఆ పద్యం భావం ఏమై ఉంటుంది?
- ఇలాంటి పద్యాలు మీకు తెలుసా?



**పిల్లలూ! ఇలా చేయండి.**

- పాఠం చదవండి. అర్థంకాని పదాల కింద గీత గీయండి.
- ఈ పదాలకు అర్థాలను పుస్తకం చివర ఉన్న అకారాది పట్టికను చూసి తెలుసుకోండి. లేదా మీ మిత్రులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.
- పాఠం చిత్రం చూడండి. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. చెప్పండి.



1. **వేరుపురుగు చేరి వృక్షంబు జెఱచును**
**జీడపురుగు చేరి చెట్టు చెఱచు**
**కుత్సితుండు చేరి గుణవంతు జెఱచురా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**భావం:** వేరుపురుగు వేరును తొలిచి చెట్టును పాడుచేస్తుంది. అట్లాగే చీడపురుగు చెట్లపైకి చేరి చెట్లను పాడు చేస్తుంది. కీడుజేసేవాడు గుణవంతుణ్ణి కూడా చెడగొడతాడు.

2. **ఇనుము విఱిగెనేని యినుమారు ముమ్మారు**
**కాచి యతుక వచ్చు గ్రమము గాను**
**మనసు విఱిఁగెనేని మఱి చేర్చరాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

**భావం:** ఇనుము రెండు, మూడు సార్లు విరిగినా కూడా దాన్ని వేడి చేసి మళ్ళీ అతికించవచ్చు. కాని మనసు విరిగితే మాత్రం మళ్ళీ కలపడం వీలుకాదు.





3. **ఏరకుమీ కసుగాయలు**
**దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ**
**పారకుమీ రణమందున**
**మీరకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!**

**భావం:** భూమిపై పచ్చికాయలు ఏఱి తినకూడదు. చుట్టాల తప్పులను ఎంచగూడదు. యుద్ధం నుండి వెనుదిరిగి పారిపోగూడదు. పెద్దల ఆజ్ఞలను జవదాటగూడదు.



4. **ఆకొన్న కూడె యమృతము**
**తాగొంకక నిచ్చువాడె దాత ధరిత్రిన్**
**సోకోర్చువాఁడె మనుజుఁడు**
**తేకువ గలవాఁడె వంశతిలకుఁడు సుమతీ!**

**భావం:** లోకంలో ఆకలితో ఉన్నప్పుడు తినే అన్నమే అమృతంలా ఉంటుంది. దేనికైనా వెనకడుగువేయక దానం చేసేవాడే దాత. కష్టానికి ఓర్చుకొనేవాడే మానవుడు. ధైర్యం గలవాడే వంశంలో గొప్పవాడు.

5. **సద్గోష్ఠియె సిరి యొసగును**
**సద్గోష్ఠియె కీర్తి పెంచు సంతుష్టిని నా**
**సద్గోష్ఠియె ఒనగూర్చును**
**సద్గోష్ఠియె పాపములను చరచు కుమారా!**

**భావం:** మంచివారితో స్నేహంచేయడంవల్ల సంపద పెరుగుతుంది. పేరుప్రతిష్ఠలు వస్తాయి. సంతృప్తి కలుగుతుంది. పాపాలు కూడా తొలగిపోతాయి.




© SCERT not to be republished




6. **సాధు సంగమమున సామాన్యుడును గూడ**
**మంచి గుణములను గ్రహించుచుండు**
**పుష్పసౌరభంబు పొందదా దారంబు**
**లలిత సుగుణ జాల! తెలుగు బాల!**

**భావం:** పూలను కుచ్చడం వల్ల వాటి సుగంధం దారానికి కూడా అబ్బుతుంది. అలాగే మంచివారితో కలిసి ఉండడంవల్ల సామాన్యుడు కూడా మంచిగుణాలను అలవరచుకొంటాడు.



7. ఇనుఁడు వెలుగు నిచ్చు; ఘనుఁడు వర్షము నిచ్చు;
గాలి వీచు; చెట్లు పూలు పూచు
సాధుపుంగవులకు సహజ లక్షణమిది
లలిత సుగుణ జాల! తెలుగు బాల!

**భావం:** సూర్యుడు వెలుగు నిస్తాడు. మేఘాలు వర్షాన్ని ఇస్తాయి. గాలి వీస్తుంది. చెట్లు పూలు పూస్తాయి. గొప్పవారికి ఇలాంటి లక్షణాలు సహజంగా ఉంటాయి.



8. ధర్మగుణము మించు ధనధాన్యములు లేవు
విద్యకన్న మించు విభవమేది
నీతి వేరెలేదు నిజము పల్కుట కంటె
తెలిసికొమ్ము నీవు తెలుగుబిడ్డ.

**భావం:** ఓ తెలుగుబిడ్డా! ధర్మగుణానికి మించిన ధనమూ లేదు. ధాన్యమూ లేదు. విద్యకన్నా మించిన సంపద లేదు. నిజం పల్కుట మాత్రమే నీతి అని తెలుసుకో.

© SCERT not to be republished



9. ఎఱుక గలవారి చరితలు
గఱచుచు సజ్జనుల గోష్ఠి గదలకు ధర్మం
బెఱుగుచు నెఱిగిన దానిని
మఱువ కనుష్ఠించునది సమంజస బుద్ధిన్

**భావం:** జ్ఞానవంతుల చరిత్రలు తెలుసుకోవాలి. మంచివారి సాంగత్యంతో ధర్మం గ్రహించాలి. తెలుసుకున్న ధర్మాన్ని మరవకుండా మంచి బుద్ధితో ఆచరించాలి.

**– మహాభారతం**



10. శ్రద్ధ లేనియెడల చదువు సాములు రావు
శ్రద్ధయున్న రానిచదువు లేదు.
శ్రద్ధ కలిగెనేని చంద్రమండల యాత్ర
సులభసాధ్యమె యగు తెలుగుబిడ్డ.

**భావం:** ఓ తెలుగు బిడ్డా! శ్రద్ధ లేకపోతే చదువు సంధ్యలు రావు. శ్రద్ధ ఉంటే దేన్నైనా సాధించవచ్చు. చంద్రమండలాన్ని కూడా చేరుకోవచ్చు. శ్రద్ధే అన్నిటికీ మూలం.

## కవి పరిచయాలు

| శతకం పేరు | రాసినవారు |
|---|---|
| సుమతీ శతకం | బద్దెన |
| వేమన శతకం | వేమన |
| కుమార శతకం | పక్కి అప్పల నరసయ్య |
| మహాభారతం | నన్నయభట్టు |
| తెలుగు బాల | కరుణ శ్రీ |
| తెలుగు బిడ్డ | నార్ల చిరంజీవి |

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I వినడం, ఆలోచించి చెప్పడం



అ) పద్యాలను చూడకుండా రాగయుక్తంగా, చక్కగా చదవండి. వాటి భావం చెప్పండి?

ఆ) పెద్దల ఆజ్ఞలను జవదాటగూడదని తెలుసుకున్నారు కదా! మీరు పెద్దలపట్ల ఎలా ప్రవర్తిస్తారో చెప్పండి.

ఇ) శ్రద్ధ ఉంటే చదువు వస్తుందని తెలుసుకున్నారు కదా! మీరు మీ పాఠశాలలో ఎలా చదువుతున్నారో చెప్పండి.

## II ధారాళంగా చదవడం, అర్థంచేసుకొని చెప్పడం, రాయడం



అ) కింది భావాలకు సరైన పద్యపాదాలు రాయండి.

1. మనసు విరిగితే మళ్ళీ కలపలేం.
2. ధైర్యం గలవాడే వంశంలో గొప్పవాడు.
3. పూలను గుచ్చడం వల్ల వాటి సువాసనలు దారానికి కూడా అంటుతుంది.
5. శ్రద్ధ ఉంటే దేన్నైనా సాధించవచ్చు.

ఆ) కింది పదాలు ఏ సందర్భాల్లో వచ్చాయో రాయండి.

1. చీడపురుగు చేరి చెట్టు చెఱచు.
2. దూరకుమీ బంధుజనుల దోషము సుమ్మీ.
3. సద్గోష్ఠియె సిరియొసగును.
4. గాలి వీచు; చెట్లు పూలుపూచు

ఇ) పాఠం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.

1. గొప్పవారి లక్షణాలను వేటితో పోల్చారు?
2. మంచివారి సాంగత్యంవల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?
3. శ్రద్ధవల్ల ప్రయోజనాలేమిటి?

## III ఆలోచించి సొంతమాటల్లో రాయడం (స్వీయరచన)




అ) మంచివారితో స్నేహం చేయడం వల్ల మంచి జరుగుతుందని తెలుసుకున్నాం కదా! దీనిని సమర్థిస్తూ రాయండి.

ఆ) శ్రద్ధ ఉంటే ఏదైనా సాధించవచ్చు అని తెలుసుకున్నారు కదా! వేటి పట్ల శ్రద్ధ కలిగి ఉండాలి? శ్రద్ధతో ఏం సాధించాలనుకుంటున్నారు?

ఇ) బంధువులను దూషించరాదు కదా! మీ బంధువులతో మీరు ఎలా ప్రవర్తిస్తారో సొంతమాటల్లో రాయండి.

## IV పదజాలం



అ) కింది వాక్యాలలో గీత గీసిన పదానికి సరైన అర్థాన్ని గుర్తించి దాని కింద గీత గీయండి.

1. మనం **ధరిత్రి**పై నివసిస్తున్నాం. (భూమి/ఆకాశం)
2. అన్ని జీవులకు **వాయువు** అవసరం. (గాలి/కాఫీ)
3. పెద్దలపట్ల **మర్యాద**గా ఉండాలి. (గౌరవం/అశ్రద్ధగా)

©SCERT not to be republished


## V సృజనాత్మకత



అ) పాఠంలోని ఏదైనా ఒక పద్యభావం వచ్చేటట్లు ఒక కథ రాయండి.


ఆ) ఏది సాధించాలన్నా శ్రద్ధ అవసరమని మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

## VI ప్రశంస



తెలుగు భాషలోని 'పద్యాలు' ప్రసిద్ధమైనవి. వేమన, సుమతి శతకాలు, కుమార శతకం, నార్ల చిరంజీవి, తెలుగు బిడ్డ వంటి శతక పద్యాలు పిల్లలందరూ నేర్చుకోవలసినవి. మీకు ఎన్ని పద్యాలు వస్తాయి? ఒక్కొక్కరు కనీసం యాభై పద్యాలు చదవగలగాలి. రాయగలగాలి. మీ తరగతిలో ఇలా యాభై పద్యాలు ఎవరికి వస్తాయో చెప్పండి. వాళ్ళను ఎలా అభినందిస్తారో చెప్పండి.

## VII భాషను గురించి తెలుసుకుందాం



**అ) కింది వాక్యాల్లోని విభక్తులను గుర్తించి గీతగీయండి.**

1. వేరుపురుగు వేరును తొలుస్తుంది.
2. లోకంలో ఆకలి సమయంలో తినే అన్నమే అమృతంతో సమానం.
3. మంచి వారితో స్నేహం చేయడంవల్ల మన విలువ పెరుగుతుంది.

**ఆ) కింది విభక్తులను ఉపయోగించి వాక్యాలు రాయండి.**

ని, కి, కు, గురించి, వలన, కొరకు, లో, తో

**ఉదా:** సీత లక్ష్మిని తోడుతీసుకొని వెళ్ళింది.

### ప్రాజెక్టు పని

మీ తరగతి గ్రంథాలయంలోని వేమన శతకం, సుమతీ శతకం వంటి పుస్తకాలు చూడండి. వాటిలో మీకు తెల్సిన పద్యాలు ఎన్ని? తెలియని పద్యాలు ఎన్నో రాయండి. మీకు తెలియని పద్యాలలో మీకునచ్చిన ఏవైనా ఐదు పద్యాలు రాయండి. వాటి భావాన్ని చెప్పండి.

### నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగ, భావ యుక్తంగా చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పద్యాలను, భావాలను చదవగలను. ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను/కాదు |
| 3. | పద్యభావాల ఆధారంగా సొంతమాటల్లో జవాబులు రాయగలను. | ఔను/కాదు |
| 4. | పద్యభావాలకు తగిన కథను రాయగలను. | ఔను/కాదు |

పెద్దవారి మాటలు విందులు కావు. మందులు.

\- శ్రీ సత్యసాయి

© SCERT not to be republished

# చదువు ఆనందించు

# అన్నదమ్ములకథ

రామాపురం అనే ఊరిలో ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు. వాళ్ళ తండ్రి చనిపోతూ వారిద్దరికీ ఒక మామిడి చెట్టు, ఒక ఆవు, ఒక కంబళి ఇచ్చి వాటిని ఇద్దరూ సమానంగా అనుభవించమని చెప్పి చనిపోయాడు.

ఆ ఇద్దరిలో తమ్ముడు అమాయకుడు. అన్న గడుసువాడు. అన్న తమ్ముడితో "నాన్న మనకు ఒకే చెట్టు, ఒకే ఆవు, ఒకే కంబళి ఇచ్చాడు కదా! వాటిని ముక్కలు చేయకూడదు. కనుక వాటిని కలిసి ఉపయోగించుకుందాం. చెట్టు మొదలు భాగం నీకు, పై కొమ్మల భాగం నాకు. అట్లాగే ఆవు ముందు భాగం నీకు వెనుక భాగం నాకు. ఇక కంబళి పగలంతా నువ్వు వాడుకో, రాత్రికి నాకు ఇచ్చేయ్" అన్నాడు అన్న. తమ్ముడు అందులోని కపటం తెలియక సరేనన్నాడు. రోజూ తమ్ముడు చెట్టు మొదట కుదుర్లో నీళ్ళు పోసేవాడు, ఆవుకు మేత, కుడితి పెట్టేవాడు. కంబళిని ఉతికి ఆరవేసి మడిచి పెట్టేవాడు. అన్న కొమ్మలకు కాసిన కాయలు, పండ్లు తాను తీసుకొనేవాడు. ఆవు పాలు తాను పితుకుకొనేవాడు. అన్న చక్కగా రాత్రిపూట కంబళిని కప్పుకొనేవాడు.

ఇట్లా కొంతకాలం గడిచింది. తమ్ముడికి పెళ్ళి అయ్యింది. అతని భార్య అమాయకుడైన తన భర్తను అతడి అన్న ఎట్లా మోసం చేస్తున్నాడో గమనించింది. భర్తతో ఒక మాట చెప్పి ఆ విధంగా చేయమన్నది. భార్యమాట ప్రకారంగా తమ్ముడు ఒక గొడ్డలి తెచ్చి దాంతో చెట్టు మొదలును నరకడం మొదలుపెట్టాడు. దానికి అన్న "చెట్టు ఎందుకు నరుకుతున్నావు" అని అడగగా "చెట్టు మొదలు నాది కదా! నాయిష్టం! అన్నాడు తమ్ముడు. మొదలు కొడితే చెట్టు మొత్తం చచ్చిపోతుంది కొట్టకు. ఇక నుంచి కాసేపండ్లు చెరిసగం తీసుకుందాం" అన్నాడు అన్న.

అన్న పాలు పితికే వేళకు తమ్ముడు ఆవుకు మేత వేయకపోగా ఒక కర్ర తీసుకొని ఆవు ముట్టెమీద కొట్టసాగాడు. పాలివ్వకుండా ఆవు అన్నని తన్నింది. "అదేమిటి?" అని అన్న అడిగితే, "ఆవు ముందు భాగం నాది కదా! నా ఇష్టం" అని బదులు చెప్పాడు తమ్ముడు. అన్న అప్పుడు "ఇక మీదట ఇద్దరమూ ఆవును మేపుదాం, పాలు కూడా సమానంగా పంచుకొందాం" అన్నాడు.



ఆ మరునాడు తమ్ముడు కంబళిని పగటిపూట నీటిలో తడిపి, ఆ తడి కంబళిని సాయంత్రం అన్నకు ఇచ్చాడు. అన్న దానిని ఉపయోగించు కోలేకపోయాడు. దాంతో అన్నకు బుద్ధివచ్చి, 'తన తప్పును క్షమించమని' తమ్ముడిని బతిమాలాడు. ఆ తర్వాత అన్నదమ్ములిద్దరూ సమానంగా అన్నిటినీ అనుభవిస్తూ హాయిగా సుఖంగా జీవించారు.

© SCERT not to be republished

# పదాలు - అర్థాలు

**అ**

అంధకారం = చీకటి
అక్షయ = నశించని, తిరుగులేని
అఖండం = నిండైనది
అద్భుత = ఆశ్చర్యకరమయిన
అధ్యయనం = నేర్చుకోవడం
అనాదిగా = చాలా పూర్వంనుండి
అనుజ్ఞ = అనుమతి
అనురాగం = ప్రేమ
అనుష్ఠించు (క్రి.) = ఆచరించడం, పాటించడం
అన్వేషణ = వెదకడం
అభినందించు (క్రి.) = మెచ్చడం, శుభాకాంక్షలు చెప్పడం
అర్చించు (క్రి.) = పూజించడం
అర్ధనారీశ్వరుడు = శివుడు (సగభాగం స్త్రీగా ఉన్న ఈశ్వరుడు)
అలనాడు = ఆరోజు, పూర్వకాలంలో
అల్లారు ముద్దుగా = అధిక ప్రేమతో
అవగాహన = ఆకళింపు, అర్థంచేసుకోవడం
అవనత = దించిన, వంచిన
అశ్రువులు = కన్నీళ్ళు
అష్టాదశ = పద్ధెనిమిది

**ఆ**

ఆకసం = ఆకాశం
ఆజ్ఞ = ఆదేశం, ఉత్తరువు
ఆత్మవిశ్వాసం = తనపై తనకున్న నమ్మకం
ఆదరించు (క్రి.) = గౌరవించడం, దగ్గరకు తీయడం
ఆదా = పొదుపు, లాభం, మిగులు
ఆధునికం = నవీనం, ఇప్పటిది, కొత్తది
ఆనందం = సంతోషం
ఆనవాళ్ళు = తెలుసుకొనే గుర్తులు
ఆప్యాయంగా = ప్రేమగా
ఆమదోషం = రోగబాధ
ఆమోదించు (క్రి.) = ఒప్పుకోవడం
ఆరగించు (క్రి.) = తినడం
ఆరాధించు (క్రి.) = పూజించడం, అర్చించడం
ఆరామము = తోట
ఆలపించు (క్రి.) = పాడటం
ఆలయం = గుడి, ఇల్లు
ఆవల = అవతల, బయట
ఆవిర్భవించు (క్రి.) = పుట్టడం
ఆవిష్కరించు (క్రి.) = వెల్లడించడం, ప్రకటించడం, విడుదల చేయడం
ఆశీర్వదించు (క్రి.) = దీవించు
ఆహ్లాదం = సంతోషం
ఆహ్వానం = పిలుపు

**ఇ**

ఇంపు = ఇష్టం, ఆనందం
ఇతిహాసం = రామాయణం లేదా మహాభారతం, జరిగినది
ఇనుడు = సూర్యుడు
ఇనుమడింపజేయు(క్రి.) = రెట్టింపు చేయడం
ఇరవు = స్థానం
ఇరుమారు = రెండు సార్లు
ఇసుమంత = కొద్దిగ (ఇసుకంత)

**ఉ**

ఉత్కంఠ = తహతహ, తెలుసుకోవాలన్న ఆత్రం
ఉత్పత్తి = పుట్టుక, తయారుచేయడం
ఉత్సవం = పండుగ
ఉద్భవం = పుట్టడం
ఉద్యమం = ప్రయత్నం, పోరాటం
ఉబ్బి = పొంగి, సంతోషించి

**ఎ**

ఎద = హృదయం
ఎడబాయని = వదలని
ఎఱుకగలవారు = జ్ఞానవంతులు, తెలివైనవారు
ఎల్ల = హద్దు

**ఏ**

ఏకైక = ఒక్కొక్క ; ఒకే ఒక
ఏండ్లు = సంత్సరాలు

**ఒ**

ఒనగూర్చు = సిద్ధించు, కలిగించు

**ఔ**

ఔదార్యం = దానగుణం, ఉదారత

**క**

కంబళి = గొంగడి, ఉన్నితో నేసిన దుప్పటి
కడు = అధిక, చాలా
కరతాళధ్వనులు = చప్పట్లు
కరవీరం = గన్నేరు, కత్తి
కరుణ = దయ
కర్షకులు = రైతులు
కలకాలం = ఎల్లప్పుడు
కలుపుతీయు (క్రి.) = పంట మొక్కల మధ్య పెరిగిన ఇతరమైన పనికిరాని మొక్కలను పీకివేయడం
కళాతృష్ణ = కళల పట్ల ఆసక్తి
కసుగాయలు = లేతకాయలు
కళ్యాణం = పెళ్లి
కాంతి = వెలుతురు
కారా = చెఱసాల
కాలికి బుద్ధి చెప్పు(క్రి.)= పారిపోవడం
కాసులు = నాణేలు, ధనం, డబ్బులు
కిక్కిరిసి = ఎడం లేకుండా వ్యాపించి
క్రిమిసంహారిణి = క్రిములను చంపేది
కుంచె = చిత్రం గీసే కుచ్చు కఱ్ఱ, బ్రష్

© SCERT not to be republished

కుత్సితంబు = చెడ్డబుద్ధి, మోసం, అసూయ
కుందు (క్రి.) = శోకించుట
కునుకు (క్రి.) = నిద్రతో తూగడం, జోగడం
కుమారి = కన్యాకుమారి (పాఠంలోని అర్థం)
కుళాయి = నీటి పంపు
కృతజ్ఞత = చేసిన మేలు తలచడం, మరవకపోవడం
కేతనం = జెండా
కేరింతలు = ఉత్సాహంతో కేకలు వేయడం
క్షేత్రం = పుణ్యస్థలం, స్థలం, పొలం
కొంకక = భయపడక, వెనకడుగువేయక
కొనియాడు (క్రి.) = పొగడు
కొలను = సరస్సు, చెరువు, మడుగు
కొలుచు (క్రి.) = సేవించు, ఉపాసించు
కొలువు = సభ, ఆస్థానం
కోలాహలం = సందడి, కలకలం
కోవిదులు = పండితులు, విద్వాంసులు

**ఖ**

ఖండం = భాగం
ఖరారు = స్థిరపరచడం, నిర్ధారించడం
ఖరీదైన = విలువైన, ఎక్కువ ధరకలిగిన
ఖ్యాతి = పేరు, కీర్తి, ప్రసిద్ధి

**గ**

గంగాళం = నీళ్ల కొప్పెర, పెద్ద పాత్ర
గంజి వార్చు (క్రి.) = అన్నం ఉడకగా మిగిలిన ఎసరు నీళ్ళ బయటకు వచ్చేలా వంచడం
గట్టు = ఒడ్డు
గంధోళి = పుప్పొడి
గమ్మత్తు = వేడుక, తమాషా
గర్జించు (క్రి.) = ఉరమడం, గట్టిగా అరవడం
గాటము = అధికం, ఎక్కువ
గాదె = ధాన్యం నిలవ ఉంచే కొట్టు
గిట్టకపోవు (క్రి.) = నచ్చకపోవడం
గిరులు = పర్వతాలు
గింజుకొను (క్రి.) = ఏడుస్తూ కాళ్లు విదిలించడం
గీతం = పాట
గుడి = దేవాలయం
గుబాళించు (క్రి.) = వాసన వెదజల్లుట
గృహాలంకరణ = ఇంటిని అందంగా అలంకరించుట
గృహిణి = ఇల్లాలు
గొనుగు (క్రి.) = పైకి వినబడకుండా పెదవులు కదుపుతూఅస్పష్టంగా మాట్లాడటం
గోమయం = ఆవుపేడ

**ఘ**

ఘనుడు = గొప్పవాడు, మేఘుడు

**చ**

చరచు (క్రి.) = పోగొట్టు, అరచేత్తో తట్టడం
చరిత = నడవడి
చిటి = చిన్న
చిత్రం = బొమ్మ
చిహ్నం = గుర్తు
చురుకుగా = వేగంగా
చెరసాల = జైలు
చెలికత్తె = స్నేహితురాలు
చెమ్మనేల = తడినేల
చేతబూని = చేతపట్టుకొని
చైతన్యం = ప్రాణం, తెలివి

**జ**

జనని = తల్లి
జలకాలాడు (క్రి.) = స్నానంచేయు
జాగీరు = సొంత భూమి, రాజు బహుమానంగా ఇచ్చినది
జాగృతి = మేలుకొలుపు
జాలి = దయ
జీవరాశి = ప్రాణుల సమూహం

**త**

తడవక = ప్రస్తావించక, వెదకక
తరగని = తగ్గని
తరగలు = అలలు
తలలో నాలుక = అణకువగా, వినయంగా
తలుచు (క్రి.) = జ్ఞాపకం చేసుకోవడం
కొంకు (క్రి.) = వెనుదీయడం, భయపడడం
తాపం = బాధ, సంతాపం, వేడి
తాళపత్రం = తాటేకు
తిరునాళ్ళు = దేవుని ఉత్సవాలు, జాతరలు
తిలకించు (క్రి.) = చూడటం
తివాచి = నేలమీద పరచుకొనే ఉన్ని ఆస్తరణం
తీరం = ఒడ్డు
తీవ = తీగ
తీవ్రతరం = ఇంకాఎక్కువ
తెగువ = సాహసం, తెగింపు
తేకువ = ధైర్యం, వివేకం
తేజస్సు = ప్రకాశం, వెలుగు
తొలిరోజులు = మొదటి రోజులు
త్యాగం చేయు (క్రి.) = వదులుకోవడం, విడిచిపెట్టడం

**ద**

దండిగ = ఎక్కువగా
దర్శించు (క్రి.) = చూడటం
దాడి = దండెత్తడం, హఠాత్తుగా వచ్చిపడటం
దాత = ఇచ్చేవాడు, దానం చేసేవాడు
దీవన = మంచి జరగాలని కోరుకోవడం
దుక్కి దున్ని (క్రి.) = వ్యవసాయ భూమి దున్నడం
దుబ్బులు = గడ్డి గంటలు
దుర్గంధం = చెడు వాసన
దులుపు (క్రి.) = రాల్చడం, రాలగొట్టడం
దేశ వ్యాప్తంగా = దేశమంతటా

**ధ**

ధరిత్రి = భూమి

**న**

నందనారామం = ఇంద్రుని తోట
నడయాడు (క్రి.) = నడవడం, చరించడం, కదలడం
నవధాన్యాలు = తొమ్మిది ధాన్యాలు
నమ్రత = వినయం, అణకువ
నాజూకు = సున్నితమైన
నాదం = ధ్వని
నారచీర = జనుము వంటి నారతో నేసిన చీర
నాసికం = ముక్కు
నింగి = ఆకాశం

నిదర్శనం = దృష్టాంతం
నిరంతరం = ఎల్లప్పుడూ
నిరాడంబరం = ఆడంబరంలేని, సాధారణంగా
నిర్లక్ష్యం = అశ్రద్ధ
నిరాశ = ఆశ కోల్పవడం
నిర్మించు (క్రి.) = కట్టడం
నిరీక్షించు (క్రి.) = ఎదురుచూస్తూ ఉండటం
నిరోధించు (క్రి.) = అడ్డగించడం, ఆపడం
నిర్దోషి = నేరం చేయనివాడు
నూతన = కొత్త
నెపం = సాకు
నెలవు = చోటు
నేత = నాయకుడు
నేర్పు = నైపుణ్యం, సామర్థ్యం

**ప**

పంతం = పోటీ, పౌరుషం, ప్రతిజ్ఞ
పర్వం = పండుగ
పరమానందం = అధిక సంతోషం
పరాయివాళ్లు = ఇతరులు
పరికించు (క్రి.) = పరిశీలించి చూడటం
పరిశీలించు (క్రి.) = పట్టిపట్టి చూడటం
పరిశోధించు (క్రి.) = కొత్త విషయం తెల్సుకోవడం
పరిష్కరించు (క్రి.) = చక్కబెట్టడం, సరిచేయడం
పరువు = గౌరవం
పవిత్రం = పరిశుద్ధం, పావనం, స్వచ్ఛమైన
పశ్చాత్తాపం = చేసిన తప్పు తెలుసుకొని బాధపడటం
పిపీలిక = చీమ
పసిమనసులు = చిన్న పిల్లల మనస్సులు
పాటవం = గట్టితనం, దృఢత్వం
పానవట్టం = లింగపీఠం (శివలింగానికి ఆధారంగా ఉన్న శిల)
పారకు = పారిపోకు
పారిశుద్ధ్యం = పరిశుభ్రత
పీడ = బాధ
పురాతన = ప్రాచీనం, పాతది
పూదేనియ = మకరందం, పూలతేనె
పొగడ్త = మెచ్చుకోవడం, మెప్పు
పొడసూపు (క్రి.) = కనబడటం
పొరలి = పొంగి
పోరాటం = యుద్ధం
పోరు = యుద్ధం
పోషకాహారం = ఒంటికి బలాన్ని ఇచ్చే ఆహారం
ప్రకటన = వెల్లడి చేసినది
ప్రకృతి = సహజస్థితి, మనచుట్టూఉన్నవి
ప్రతిజ్ఞ = ఏదో ఒక పనిని తప్పక చేస్తానని దృఢంగా చెప్పడం
ప్రతిభ = వికసించే బుద్ధి, నైపుణ్యం
ప్రతిమ = బొమ్మ
ప్రతీక = గుర్తు
ప్రతీతి = ఎరుక, ప్రసిద్ధి
ప్రత్యక్షమవు (క్రి.) = కంటికి కనిపించడం
ప్రదర్శించు (క్రి.) = వివరించి చూపడం
ప్రధానం = ముఖ్యంగా
ప్రవహించు (క్రి.) = పారడం
ప్రశంసించు (క్రి.) = పొగడుట
ప్రసంగం = ఏదైనా ఒక విషయాన్ని గురించి వివరంగా చెప్పడం
ప్రస్తావన = చెప్పడం, అవసరం
ప్రసిద్ధమైన = పేరు పొందిన
ప్రాతఃకాలం = ఉదయం
ప్రాయం = వయస్సు
ప్రాశస్త్యం = ప్రసిద్ధి, మంచిపేరు
ప్రియం = ఇష్టమయినది, వెలఎక్కువఉన్నది

**బ**

బంతి = పంక్తి, వరస
బహుమతి = కానుక
బాకు = కత్తి
బాటసారి = దారివెంట నడిచేవాడు
బిలం = రంధ్రం
బింకం = గర్వం
బెంగ = మనసులో దిగులు, బాధ, వెలితి
బోలెడు = చాలా

**భ**

భక్షించు (క్రి.) = తినడం
భటుడు = పనివాడు, సేవకుడు
భ్రమరం = తుమ్మెద
భరించు (క్రి.) = మోయడం
భరిణ = కుంకుమ వంటివి పోసుకొనే చిన్న (మూత ఉన్న) డబ్బా, పాత్ర
భవిష్యత్తు = కాగలది, జరగబోయే లేదా రాబోయే కాలం
భూతదయ = ప్రాణుల మీద సానుభూతి, జాలి

**మ**

మందహాసం = చిరునవ్వు
మగువ = స్త్రీ
మ్రందిన = చనిపోయిన
మన్నన = గౌరవం (చేయడం)
మమత = నాదని అనుకోవడం, ఇష్టం
మహానుభావులు = గొప్పవారు
మాటకారి = ఉపాయంగా ఎక్కువగా మాట్లాడేవాడు
మారుమూల = దూరంగా ఉండే ప్రదేశం
మారు = ప్రతి, నకలు
మిడుకు (క్రి.) = పరితపించటం, అసూయపడటం
మితభాషి = తక్కువగా మాట్లాడేవాడు
మిన్న = ఎక్కువ
మిన్ను = ఆకాశం
మీరు (క్రి.) = దాటడం
ముఖద్వారం = ఇంటిలోని మొట్టమొదటి వాకిలి
ముదము = ఆనందము, సంతోషం
ముద్రణ = అచ్చువేయడం, అచ్చు (పని)
ముమ్మారు = మూడుసార్లు
మువ్వన్నెలు = మూడు రంగులు
మూడు (క్రి.) = ముగియడం, చెడు జరగడం, కలగడం
మూర్ఖత్వము = తెలివిలేని తనం
మృతవీరులు = వీర మరణం పొందిన వారు
మేదిని = భూమి
మేధావులు = తెలివిగలవారు,బుద్ధిమంతులు

©SCERT not to be republished

మోతుబరి = గొప్ప సంపద, పేరు, పలుకుబడి కలవారు

మోదం = సంతోషం

**య**

యజ్ఞం = యాగం,దేవతలను తృప్తిపరిచే అర్చన

యథావిధిగా = ఎప్పటి లాగే

యాత్ర = పుణ్యక్షేత్రాలను సేవించబోవడం, ప్రయాణం

**ర**

రంగవల్లి = ముగ్గు

రణం = యుద్ధం

రమణీయత = అందం

రాజధాని = ముఖ్యపట్టణం

రాలు (క్రి.) = రాలిపోవడం, కిందపడడం

రీతి = విధం, రకం, పద్ధతి

**ల**

లభ్యమవు (క్రి.) = దొరకడం

లాలిమ = లాలిత్యం, మెత్తదనం

లాల్‌ఖిల్లా = ఎర్రకోట

లౌక్యం = వ్యవహారంతెలిసినవాడు,గడసరితనం

**వ**

వదనం = ముఖం

వాతము = గాలి

వాస్తవం = నిజం

విందు = ఆతిథ్యం, ప్రత్యేక సందర్భంగా పెట్టే భోజనం

వికాసం = వికసించడం, తెలివి పొందడం

విజ్ఞప్తి = విన్నపం, మనవి

విజ్ఞానం = శాస్త్రముల యందలి జ్ఞానం

వినమ్రం = వినయంతో కూడిన, అణకువగల

వినియోగం = ఉపయోగం

విపరీతంగా = అధికంగా, చాలా ఎక్కువగా

విరాజిల్లు (క్రి.) = ప్రకాశించు, మెరియు

విశ్వం = ప్రపంచం; బ్రహ్మాండంలో ఉన్న అన్ని గ్రహాలు

విభవము = సంపద, ఐశ్వర్యము

విశ్రమించు (క్రి.) = విశ్రాంతి తీసుకోవడం

విస్తరించు (క్రి.) = వ్యాపించేటట్లు చేయడం, వ్యాపించడం

వీనులు = చెవులు

వెచ్చించు (క్రి.) = ఖర్చుచేయడం, వినియోగించడం

వేడుక = పండుగ, వినోదకార్యం

**శ**

శకునం = శుభసూచన, నిమిత్తం

శాస్తి = శిక్ష

శిల = రాయి

శిల్పం = బొమ్మ వంటివి చెక్కిన రాయి

శీతల వాయువు = చలిగాలి

శోభ = కాంతి

శౌన్యం = డేగ

శౌర్యం = పరాక్రమం, శూరుడి గుణం

శ్రద్ధ = ఆసక్తి, గౌరవం

శ్లేష్మం = తెమడ, కఫం

**ష**

షష్టిపూర్తి = 60 సంవత్సరాలు పూర్తయినపుడు జరిపే వేడుక

షోకు చేసుకొను (క్రి.)= అందంగా తయారవడం

**స**

సంకేతం = గుర్తు

సంగమం = కలయిక

సంత = అమ్మకందారు పెట్టుకొనే అంగళ్ళ వరస (కనీసం వారానికి ఒకరోజుచొప్పున)

సంతసం = ఆనందం, సంతోషం

సంతుష్టి = తృప్తి, సంతోషం

సత్తువ = శక్తి

సందేశం = సమాచారం, కబురు

సందేహం = అనుమానం, శంక

సంరంభం = వేగిరపాటు, హడావుడి

సవిత్రి = తల్లి, మాత

సంస్కృతి = నాగరికత, సంస్కారం (మానసికం కాని, భౌతికం కాని)

సజ్జనులు = మంచివారు

సద్గోష్ఠి = మంచి సభ, మంచి సంఘం

సన్నెకల్లు = నూరే రాయి

సభాసదులు = సభలోనివారు

సమంజసం = న్యాయంతో కూడినది

సమగ్రత = సమస్తం, అంతా

సమత = సమానత్వం

సమాచారం = వార్త, వృత్తాంతం

సమావేశం = ఒక చోట కలుసుకోవడం

సముదాయించుకొను(క్రి.)= ఓదార్చుకొని

సమృద్ధి = ఎక్కువగా ఉండటం (సంపదమొ॥వి)

సర్వజనావళి = ప్రజలందరూ

సర్వరోగాలు = అన్ని రోగాలూ

సహకరించు (క్రి.) = తోడ్పడటం, సహాయపడటం

సహవాసం = కలిసి జీవించడం, కలిసి ఉండడం

సాధువు = సజ్జనుడు, మంచివాడు

సామర్థ్యం = నేర్పు, యోగ్యత, సమర్థత

సారం = బలం, చేవ

సింగం = సింహం

సిరి = సంపద

సువాసన = మంచివాసన

సూచిక = తెలియజేసేది

సేద = బడలిక, శ్రమ

సోకోర్చువాడు = బాధను ఓర్చుకొనేవాడు

సోయగం = అందం

సౌరభం = మంచి వాసన

సౌరులు = అందాలు

స్తుతి = పొగడడం, పొగడ్త

స్ఫూర్తి = స్ఫురించడం, ప్రభావం చూపడం

**హ**

హక్కు = ఒక సౌకర్యాన్ని అనుభవించే అవకాశం, విలువ

హాని = నష్టం, కీడు

హిమాద్రి = హిమాలయ పర్వతాలు

హొయలు = విలాసం, అందం, సొగసు కనబరుచుకొనే ఒయ్యారం

© SCERT not to be republished